నమస్తే తెలంగాణ
www.ntnews.com

# పీవీ ఖ్యాతి.. ప్రపంచానికి చాటి

## తెలంగాణ ముద్దుబిడ్డకు కేసీఆర్ అరుదైన గౌరవం

**భారతరత్న కోసం రాష్ట్ర ఏర్పాటు నుంచీ డిమాండ్ • అసెంబ్లీలో తీర్మానం.. కేంద్రానికి లేఖ**

ఏడాదిపొడవునా శతజయంతి వేడుకలు • ఆస్ట్రేలియాతోపాటు రాష్ట్రంలో విగ్రహాల ఏర్పాటు

పీవీ స్వగ్రామం వంగర, లక్నెపల్లిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అడుగులు

నరసింహారావు రచనల పునర్ముద్రణకు చర్యలు • పీవీ కుమార్తె వాణీదేవికి ఎమ్మెల్సీగా అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగునపడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రావతరణం నుంచి పీవీ జయంతి, వర్ధంతి సభలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి, దానిని అమలు చేస్తూ సముచితస్థానం కల్పించారు. రాష్ట్రంలో వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరుపెట్టి తన అభిమానాన్ని చాటుకొన్నారు. పీవీ ఔన్నత్యాన్ని నలుదిశలా తెలియజేసేందుకు శతజయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించేందుకు సంకల్పించారు.

### ఏడాది పొడవునా శతజయంతి

తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే పీవీ నరసింహారావు ఖ్యాతిని చాటేందుకు కేసీఆర్ చర్యలు చేపట్టారు. పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారు. 2015 సెప్టెంబర్ 4న ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు తూచా తప్పకుండా ప్రభుత్వం అమలు చేసింది. పీవీ శతజయంతి వేడుకలను 2020 జూన్ 28 నుంచి 2021 జూన్ 28 వరకు 'పీవీ మన తెలంగాణ ఠీవి' అనే నినాదంతో ఏడాది పొడవునా అట్టహాసంగా నిర్వహించింది. పీవీమార్గ్‌లోని జ్ఞానభూమి వద్ద వేడుకలను కేసీఆరే స్వయంగా ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు నేతృత్వంలో శతజయంతి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి పీవీని 360 డిగ్రీల కోణంలో ఆవిష్కరించేలా కార్యక్రమాలను నిర్వహించారు. దేశవిదేశాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ వేడుకలను నిర్వహించారు. దాదాపు 50కి పైగా వెబినార్లను నిర్వహించారు. నెక్లెస్‌రోడ్‌కు పీవీమార్గ్‌గా నామకరణం చేశారు. 16 అడుగుల పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, కేసీఆర్ ఆవిష్కరించారు. పీవీ జ్ఞానభూమిలో పీవీ మెమోరియల్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు.

### వారసురాలికి ఎమ్మెల్సీ

పీవీ కుమార్తెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి కేసీఆర్ తన సహృదయతను చాటుకొన్నారు. హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సురభి వాణిదేవిని నిలిపారు. స్వతహాగా విద్యావేత్త, చిత్రకారిణి కావడంతోపాటు పీవీ కుమార్తె కావడంతో సబ్బండ వర్గాల పట్టభద్రులు ఆమెను ఆదరించారు. ఎమ్మెల్సీగా 2021 మార్చి 20న పట్టం కట్టి పీవీకి ఘనమైన నివాళి అర్పించారు.

### 'పీవీ' కోసం బీఆర్‌ఎస్ చేసిన కృషి

- పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలంటూ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సిఫారసు : 04.09.2015
- పీవీకి భారతరత్న ఇవ్వాలంటూ కేంద్రానికి పీవీ శతజయంతి ఉత్సవ కమిటీ సిఫారసు: 18.06.2020
- పీవీకి భారతరత్న ఇవ్వాలంటూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం : 08.09.2020
- పీవీ శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో నమస్తే తెలంగాణ అక్షర నివాళి ( ప్రత్యేక కథనాలు) : 28.06.2020 నుంచి 28.06.2021 వరకు
- పీవీ పేరిట స్మారక స్టాంప్ కోసం అప్పటి రాష్ట్రపతి కోవింద్‌కు కేసీఆర్ లేఖ: 20.11.2020
- హెచ్‌సీయూకు పీవీ పేరు పెట్టాలని ప్రధాని మోదీకి కేసీఆర్ లేఖ : 28.06.2020
- నెక్లెస్ రోడ్డుకు పీవీమార్గ్‌గా నామకరణం : 28.06.2021
- పీవీ మార్గ్‌లో పీవీ విగ్రహం ఆవిష్కరణ : 28.06.2021
- బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్సీగా గెలిచిన పీవీ కుమార్తె సురభి వాణీదేవి : 20.03.2021

### కేయూలో పీవీ విద్యాపీఠం

ముందుతరాలకు స్ఫూర్తి కలిగించేలా వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో పీవీ విద్యాపీఠం ఏర్పాటు చేయాలని మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అప్పటి కేయూ వీసీ తాటికొండ రమేశ్ పంపిన ప్రతిపాదనలను ఆమోదించడమేగాక, పీవీ ఆదర్శాలను విద్యాపీఠం నెరవేర్చాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

### భారతరత్న కోసం డిమాండ్

**పీవీకి** భారతరత్న ఇవ్వాలని గత బీఆర్‌ఎస్ సర్కారు అనేక పర్యాయాలు డిమాండ్ చేసింది. 'దేశం అనేక సంక్లిష్ట సమస్యల్లో కూరుకుపోయిన తరుణంలో, వయస్సు పైబడిన సమయంలోనూ తన ప్రజ్ఞాపాటవాలతో మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేండ్లు ముందుకు నడపడమేగాక భారత్‌ను ప్రగతిపథంలో నడిపించారు. అంతటి మహనీయుడు పీవీకి భారతరత్న ఇచ్చి సత్కరించాలి' అని కోరుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీవీ శతజయంతి ఉత్సవ కమిటీ 2020 జూన్ 18న కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. తెలంగాణ అసెంబ్లీ సైతం ఇదే విషయమై 2020 సెప్టెంబర్ 8న ఏకగ్రీవ తీర్మానం చేసింది. పీవీ పేరిట స్మారక స్టాంప్‌ను విడుదల చేయాలని 2020 నవంబర్ 20న, హెచ్‌సీయూకు పీవీ పేరు పెట్టాలని ప్రధాని మోదీకి 2020 జూన్ 28న కేసీఆర్ లేఖ రాశారు. ప్రతి సందర్భంలోనూ కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేస్తూనే వచ్చారు.

### పర్యాటక కేంద్రాలుగా వంగర, లక్నెపల్లి

**పీవీ** స్వగ్రామం వంగర, లక్నేపల్లిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, సైట్ మ్యూజియాలుగా ఏర్పాటు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. వంగరలో పీవీ విజ్ఞాన వేదిక నిర్మాణం కోసం రూ.7 కోట్లను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. పీవీ ఇంటిని మ్యూజియంగా రూపొందించడంతోపాటు అక్కడే విజ్ఞాన వేదిక థీమ్ పార్కు నమూనాలను సైతం సిద్ధం చేసి ఆ పనులను ప్రారంభించింది. పీవీ సాహిత్య గ్రంథాలను పునర్ముద్రించేందుకు పూనుకున్నది. వరంగల్, కరీంనగర్, వంగర, ఢిల్లీ తెలంగాణా భవన్‌లో పీవీ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయడానికి రూ.35 లక్షలను మంజూరు చేసి, పనులను చేపట్టింది. పీవీ విగ్రహాన్ని ఆస్ట్రేలియా సిడ్నీ నగరంలోని ఓంబుష్ పార్కులో ఏర్పాటు చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది.




## ప్రధాని మోదీకి కేసీఆర్ థ్యాంక్స్

▶ మొదటిపేజీ తరువాయి...

ఉద్వేగానికి లోనయ్యారు. దేశాన్ని గండం నుంచి గట్టెక్కించిన తెలంగాణ బిడ్డకు ఇన్నాళ్లకు సముచిత గౌరవం దక్కిందని సన్నిహితులతో అభిప్రాయపడ్డారు. పీవీ దశాబ్దాల పాటు తన జీవితమంతా కాంగ్రెస్‌కు సేవ చేశారని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయనను ఘోరంగా అవమానించిందని కేసీఆర్ గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం పీవీ ఘనతను గుర్తించిందని, ఇది రాజకీయాలకతీతంగా అభినందించదగ్గ విషయమని అభిప్రాయపడ్డారు. 'సొంతపార్టీయే పీవీకి అన్యాయం చేసింది. చివరికి ఆయన పార్థివ దేహాన్ని కూడా ఏఐసీసీ ఆఫీసులోకి అనుమతించకుండా అవమానించింది. పీవీ అంతిమ సంస్కారం ఢిల్లీలో జరగకుండా అడ్డుపడింది. ఢిల్లీలో స్మారకం కూడా లేకుండా చేసింది. ప్రధాని మోదీ రాజకీయాలను మనసులో పెట్టుకోకుండా భారతరత్న ప్రకటించడం నిజంగా అభినందించదగిన విషయం. ఇన్నాళ్లకు పీవీకి, వారి కుటుంబానికి న్యాయం జరిగింది' అని కేసీఆర్ అన్నట్టు పార్టీ ముఖ్యులు తెలిపారు. పీవీకి భారతరత్న ప్రకటిస్తూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వెనువెంటనే కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పీవీకి భారతరత్న పురస్కారం యావత్తు తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. పీవీకి భారతరత్న ప్రకటించాలని ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన సంగతి తెలిసిందే. పార్టీగా బీఆర్‌ఎస్ కూడా ఈ మేరకు తీర్మానం చేసి పంపింది. కేసీఆర్ స్వయంగా ఈ మేరకు లేఖ రాశారు. తమ పార్టీ చేసిన డిమాండ్‌ను గౌరవించి, తగు నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి కేసీఆర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

### పీవీ ప్రొఫైల్

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | పాములపర్తి వెంకటనరసింహారావు |
| తల్లిదండ్రులు | : | రుక్మాబాయమ్మ, సీతారామారావు |
| సతీమణి | : | సత్తెమ్మ |
| పుట్టినతేదీ | : | 28.06.1921 |
| చదువు | : | బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ |
| సంతానం | : | ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు |

**రాజకీయ పదవులు**

| | | |
|---|---|---|
| మంథని ఎమ్మెల్యే | : | 1957-1977 |
| ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి | : | 1971-1973 |
| హనుమకొండ ఎంపీ | : | 1977-1984 (రెండుసార్లు) |
| రామ్‌టెక్(మహారాష్ట్ర) ఎంపీ | : | 1984-1991 (రెండుసార్లు) |
| నంద్యాల ఎంపీ (ఏపీ) | : | 1991-1996 |
| బరంపూర్(ఒడిశా) ఎంపీ | : | 1996-1998 |

1991లో భారత ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.



## మౌన ముని తాత్వికత గని

మన పీవీ బహుముఖ ప్రజ్ఞాశాలి

అంతర్జాతీయ రాజకీయాలను అవపోసనపట్టిన దౌత్య చతురుడు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన ఓ ఆలోచనాధార. తాత్వికతకు చిరునామా. ప్రజల కష్ట-సుఖాలను ఎరిగిన భూమి పుత్రుడు. అంతర్జాతీయ రాజకీయాలను అవపోసనపట్టిన దౌత్య చతురుడు కూడా. ఆర్థికవేత్తగా, భూసంస్కరణలు చేపట్టిన సంఘసంస్కర్తగా, సాహితీవేత్తగా, తాత్వికుడిగా ఆయన అందరికీ సుపరిచితులే. పీవీ ఆలోచనల్లోని భావధార ఎంత లోతైనదో ఆయన చేసిన ప్రసంగాలను బట్టి తెలుసుకోవచ్చు. ఆయన నోటినుంచి వివిధ సందర్భాల్లో జాలువారిన మాటలు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ భవిష్యత్తు తరాలకు అనుసరణీయమే.

**పీవీ మాట.. భవితకు బాట**

**ఆర్థిక స్వాతంత్ర్యానికి త్యాగాలు అవసరం**

దృఢమైన దేశ నిర్మాణంలో అంతర్భాగమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం. అయితే, దీనికోసం ఆర్థిక క్రమశిక్షణ పాటించడంతోపాటు అవసరమైన త్యాగాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలి.

**మిథ్యలో మరో మిథ్య!**

పురస్కారాలు స్వీకరించడం, సన్మానాలు చేయించుకోవడం, కిరీటాలు ధరించడం నాకు అంతగా నచ్చదు. రాజలక్షణాలన్నీ ప్రతిబింబించే ఇలాంటి వేషాలు వేయడానికి మనస్కరించదు. జీవితం మిథ్యైతే.. దానికి మరో మిథ్యను జోడించడం ఏమిటో?!

**మొక్కలో మార్పు గమనించారా?**

ఇప్పుడిప్పుడే పెరుగుతున్న మొక్కను దారిన వెళ్లే మేక కూడా తిని పారేయగలదు. కానీ, అది పెరిగి మహా వృక్షంగా మారితే ఏనుగును కూడా దానికి కట్టేయగలం.

**చట్టమే ఆయుధం**

నాగరిక సమాజంలో తుపాకులతో కూడిన పోరాటం ఉండదు. కత్తులతో యుద్ధం సాగదు. మన పోరాటం చట్టం ద్వారా సాగుతుంది. అదే మన ఆయుధం

**అహింసాయుత ప్రపంచం అప్పుడే!**

నిరాయుధీకరణకు అన్ని దేశాలు చిత్తశుద్ధితో, నిబద్ధతతో కృషి చేయాలి. తద్వారా అణ్వాయుధాల బారినుంచి బయటపడుతాం. అప్పుడే, అహింసాయుత ప్రపంచానికి నాంది పలికే అవకాశం దొరుకుతుంది.

**పల్లెప్రగతి ఎంత ముఖ్యమైనదంటే?**

గ్రామీణ ప్రాంతంలో జీవనోపాధి లేకపోతే, నిరుద్యోగి హింసకు పాల్పడుతాడు. లేకపోతే పట్టణప్రాంతాలకు వలసపోయి.. అక్కడ కొత్త సమస్యలు సృష్టిస్తాడు. అందుకే పల్లె ప్రగతి ఎంతో ముఖ్యం.

**మతోన్మాదం ప్రమాదకరమైన వైరస్**

మతోన్మాదం అనేది అత్యంత ప్రమాదకారియైన వైరస్. ఇది విద్వేషాలను పెంచుతుంది. అయితే ఈ వైరస్‌ను ఎదుర్కొనడానికి దేశశక్తిని, వనరులను ఉపయోగించవలసి రావడం దురదృష్టకరం.

**దేశ నిర్మాణమే ధ్యేయం**

రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా అందరూ ఏకమవ్వాలి. దేశ నిర్మాణమే ధ్యేయంగా కలిసిరావాలి. అప్పుడే నవ భారతం సాకారమవుతుంది.

**కార్మికులుగా మారాల్సిందే**

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోకపోతే మన దేశం అంతర్జాతీయ మార్కెట్‌లో నిలదొక్కుకోలేదు. అప్పుడు మన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ఇతర దేశాల పరిశ్రమల్లో కార్మికులుగా మగ్గిపోతారు.

**సంస్కరణల బాట పూలబాట కాదు**

సంస్కరణల బాట పూలబాట కాదు. ప్రజాస్వామ్యంలో ఇది మరింత కఠినతరం. ఇందుకు ప్రయత్నించిన ప్రతీ దేశం ఇబ్బందులను ఎదుర్కొన్నదే. అయితే చివరకు దక్కే ఫలాలే ముఖ్యం.

**యువత రావాలి**

యువత రాజకీయాల్లోకి రావాలి. స్వార్థం కోసమో, డబ్బు కోసమో కాకుండా ప్రజాసేవ చేయడానికి రావాలి. రాజకీయాల్లో కొనసాగాలంటే మనసుతో మాట్లాడుకోవాలి. మనసుకే సర్దిచెప్పుకోవాలి. అలా చేయకపోతే, రాజకీయాలు చేయలేం.

**నాణేనికి రెండు ముఖాలు**

ఆత్మ నిగ్రహం పాటించనంత వరకూ అహింసను సంపూర్ణంగా స్థాపించలేం. హింసా భావన ఉన్నంతవరకూ ఆత్మ నిగ్రహం సాధ్యంకాదు. రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాల్లాంటివి.

## కాలజ్ఞానంలో 'పీవీ'!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): భవిష్యత్తులో జరగబోయే అనేక పరిణామాల గురించి వీరబ్రహ్మేంద్రస్వామి వందల ఏండ్ల క్రితమే తన కాలజ్ఞానంలో వివరించారు. అందులో ఒక ఆసక్తికర అంశం.. 'రాబోయే కాలంలో ఢిల్లీ పరిపాలకుల్లో మరో నరసింహుడు ఉంటాడ'ని వివరించారు. దీన్ని ఒక సందర్భంలో కడప జిల్లాకు చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుడొకరు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఉత్సుకతతో చరిత్ర గురించి ఆరాతీశారు. గడిచిన నాలుగు వందల ఏండ్లలో ఢిల్లీని కేంద్రంగా పరిపాలించిన రాజుల పేర్లనన్నింటినీ వడబోశారు. ఎక్కడా నరసింహ అనే పేరు ఉన్న రాజుకానీ, పరిపాలకుడు కానీ ఆయనకు కనిపించలేదు. అదే సమయంలో పీవీ ఢిల్లీలో ప్రధానిగా దేశాన్ని ఏలుతున్నారు. దీంతో కాలజ్ఞానంలో వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన నరసింహనామధేయుడు పీవీ నరసింహారావునే అని కుటుంబరావు సూత్రీకరించారు.

## మంథని నుంచే రాజకీయప్రస్థానం

**నరసింహారావు తొలి విజయం ఇక్కడినుంచే**

**మంత్రిగా, సీఎంగా మంథని నుంచే ప్రాతినిధ్యం**

పెద్దపల్లి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సుదీర్ఘ రాజకీయ చరిత్ర మంథనితోనే మొదలయ్యింది. పీవీకి తొలుత 1952లో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం వచ్చింది. తొలి ఎన్నిక ఆయనకు కలిసి రాకపోవడంతో పరాజయం పాలయ్యారు. 1957 సార్వత్రిక ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే.. సోషలిస్టు పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. మంథని తొలి ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు తిరిగి మంథని నుంచి పోటీ చేసేందుకు టికెట్ కోసం ఆశించగా ఆయనకు పోటీగా జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌కాచే సైతం కాంగ్రెస్ టికెట్ తనకే కావాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ అధిష్ఠానం మధ్యే మార్గంగా పీవీ పేరును తెరమీదకు తెచ్చింది. దీంతో పీవీకి 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం లభించింది. మంథని ఎమ్మెల్యేగా విద్య, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రిగా, ఏకంగా ముఖ్యమంత్రిగా పని చేశారు. మంథని నుంచి 1957, 1962, 1967, 1972లో నాలుగుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు నెలకొల్పారు. ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లిన పీవీ ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్కో అందలం ఎక్కుతూ చివరికి ప్రపంచమే కీర్తించే విధంగా భారత దేశ ప్రధానిగా తన పరిపాలనా దక్షతను చాటుకున్నారు. 20ఏండ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఇక్కడి ప్రజలతో మమేకమై పనిచేశారు.




## పీవీకి 'నమస్తే' అక్షర నివాళి

**'నమస్తే పీవీ' పేరిట పుస్తకం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

*హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను ఆయన ఔన్నత్యానికి తగిన రీతిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పీవీలోని భిన్న కోణాలను ఆవిష్కరిస్తూ ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా 28.06.2020 నుంచి 28.06.2021 వరకు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వందలాది కథనాలతో అక్షర నివాళి అర్పించింది. అనంతరం 'నమస్తే పీవీ' పేరిట పుస్తకాన్నీ అందుబాటులోకి తీసుకొచ్చింది.*

## అపర చాణక్యుడు మన పీవీ

**అపరచాణక్యుడు, రాజనీతి దురంధరుడనే బిరుదులు పీవీకి ఊరికే రాలేదు. మైనార్టీ ప్రభుత్వాన్ని పూర్తి కాలం కొనసాగించడం పీవీకేమీ నల్లేరు మీద నడకగా సాగలేదు. ఒకవైపు దివాలా తీసిన దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే మరో వైపు విపక్షాల నుంచి ఎదురైన విశ్వాస పరీక్షల నుంచి గట్టెక్కుతూ వచ్చారు పీవీ. మరోవైపు సొంత పార్టీలో ఉత్తరాది అసమ్మతి నేతల ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తు చేసుకుంటూ ముందుకుసాగాల్సి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే కృష్ణా,రామా అంటూ ప్రశాంత జీవితం గడపాల్సిన ఏడు పదుల వయసులో ఇంటా, బయటా ముప్పేట ఎదురైన సమస్యల్ని తన అపార రాజకీయ అనుభవ చతురతతో, చాణక్యనీతితో అవలీలగా అధిగమిస్తూ సమర్థంగా తిప్పికొట్టగలిగారు పీవీ!**

**ప్రధాని** పదవిపై కన్నేసిన మరాఠ్వాడా నాయకుడు శరద్‌పవార్‌ను పక్కన పెడితే ఎప్పటికైనా ముప్పేనని గ్రహించి అతన్నే ఒప్పించి, మెప్పించి తన కండ్లముందు ఉండేలా మంత్రివర్గంలో చేర్చుకున్నారు. రక్షణశాఖ వంటి కీలకమైన శాఖను అప్పగించి పని ఒత్తిడిలో మునిగి తేలేలా చేశారు. అయినప్పటికీ పీవీని గద్దెదించే అవకాశం కోసం శరద్‌పవార్ మొదటి నుంచీ కాచుకొని కూర్చున్నారు. తనకు ముఖ్య శాఖ అప్పగించలేదన్న ఆగ్రహంతో రగిలిపోతున్న అర్జున్‌సింగ్ ఆయనకు తోడయ్యారు. వీరిద్దరితో మరో అసమ్మతి నాయకుడు మాధవరావుసింధియా జతకట్టారు. దీంతో బయటి వారికంటే పీవీకి అంతర్గత శత్రువుల బెడదనే ఎక్కువైంది. రాజకీయంగా దెబ్బతీయడానికి తన ప్రత్యర్థులు పన్నే ఎత్తులను పీవీ ఎప్పటికప్పుడు చిత్తు చేస్తూ వచ్చారు. వరుస బాంబుల పేలుళ్ల దుర్ఘటన తర్వాత బొంబాయిలో అల్లర్లు జరిగాయి. అప్పుడు మహారాష్ట్ర సీఎంగా ఉన్న సుధాకర్‌నాయక్‌ను అల్లర్ల సాకుతో గద్దె దింపడానికి శరద్ పావులు కదిపారు. వాస్తవానికి సుధాకర్‌నాయక్‌ను సీఎంను చేసింది శరద్‌పవారే. మహారాష్ట్ర సీఎంగా ఉన్న శరద్ పవార్‌ను ప్రధాని పీవీ మంత్రివర్గంలో చేర్చుకోవడంతో తనకు నమ్మిన బంటుగా ఉన్న సుధాకర్‌నాయక్‌ను సీఎంగా ఆయనే ఎంపిక చేశారు. ఆ తర్వాత సుధాకర్‌నాయక్ శరద్‌పవార్‌కు దూరమై ప్రధాని పీవీకి దగ్గరయ్యారు. దీంతో సుధాకర్ నాయక్ ను సీఎం పీఠం నుంచి దించడానికి తగిన సమయం కోసం శరద్‌పవార్ ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఒక వ్యక్తికి ఒకే పదవి నినాదంతో కాంగ్రెస్ అధ్యక్షునిగా కూడా ఉన్న పీవీ పదవికి అర్జున్‌సింగ్ ఎసరు పెట్టారు. ఆయనతో శరద్‌పవార్ కూడా అంతర్గతంగా జతకట్టారు. ఒక వ్యక్తికి ఒక పదవి అనే పార్టీ నియమావళి నుంచి తనకు మినహాయింపు ఇచ్చేలా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో తీర్మానం చేయించి అర్జున్‌సింగ్ ఎత్తుగడను పీవీ చిత్తు చేయగలిగారు. అర్జున్, శరద్ పవార్ల కదలికలపై మహారాష్ట్ర సీఎం గా ఉన్నా సుధాకర్‌నాయక్ ఎప్పటికప్పుడు పీవీకి ఉప్పు అందిస్తూ మరింత దగ్గరయ్యారు. పవార్ వర్గీయులను ఒకొక్కరినీ తప్పిస్తూ వచ్చారు. దీంతో రగిలిపోయిన శరద్ పవార్ వర్గానికి బొంబాయి అల్లర్లు కలిసి వచ్చాయి. ఈ అల్లర్లకు సీఎం అసమర్థతే కారణమని, అతన్ని గద్దె దించాలని శరద్ పవార్ వర్గం పార్టీ అధినేత, ప్రధాని పీవీపై ఒత్తిడి పెంచింది.



సుధాకర్ నాయక్ స్థానంలో తాను సూచించిన వ్యక్తినే సీఎం చేయాలని శరద్‌పవార్ పట్టుబట్టారు. శరద్ పవార్ సూచించే వ్యక్తిని మాత్రం సీఎం చేయొద్దని సుధాకర్‌నాయక్ పట్టుదలకు పోయారు. కొత్త సీఎంను ఎంపిక చేసే అధికారాన్ని పార్టీ అధినేత, ప్రధాని పీవీకి కట్టబెడుతూ మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీర్మానం చేసింది. ఇక్కడ పీవీ చాణక్యనీతిని ప్రదర్శించారు. ఎవరూ ఊహించని విధంగా సుధాకర్ నాయక్ స్థానంలో మళ్లీ శరద్ పవార్‌నే ముఖ్యమంత్రిగా ప్రకటించారు. దీంతో శరద్‌పవార్, సుధాకర్‌నాయక్ ఇరు వర్గాలకు కళ్లు బైర్లు కమ్మాయి. వీరిద్దరూ పీవీనా? మజాకా? అనక తప్పలేదు. గుడ్డిలో మెల్లగా తన పంతం నెగ్గిందని సుధాకర్‌నాయక్ తృప్తి చెందారు. తాను సీఎంగా పెట్టిన నాయక్ తోక కత్తిరించే అవకాశం తనకే దక్కిందన్న సంతృప్తితో శరద్‌పవార్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ లో తలపండిన నాయకులు సైతం దటీజ్ పీవీ అని మెచ్చుకోక తప్పలేదు. శరద్ పవార్ పన్నిన రాజకీయ ఎత్తుగడకు అతనే చిత్తు అయి చివరికి వచ్చిన సొంత రాష్ట్రం బాట పట్టక తప్పని పరిస్థితి కల్పించడం ద్వారా పీవీ రాజనీతికి నిదర్శనం.

**- వెల్జాల చంద్రశేఖర్**